క్లుప్తంగా

లబ్ధిదారులపై ఒత్తిడి తగ్గించండి



గుడివాడ టౌన్: టిడ్కో గృహాల లబ్ధిదారుల రుణం చెల్లింపు విషయంలో మెప్మా సిబ్బంది ఒత్తిడి తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా బ్యాంకు రుణం వాయిదాల పద్ధతిలో కట్టాల్సి ఉందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రకరకాల హామీలు ఇచ్చారన్నారు. కొత్త ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియదు కనుక మెప్మా సిబ్బంది లబ్ధిదారులపై ఒత్తిడి తేవద్దని కోరారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే క్రమంలో పూర్తి రుణమాఫీ చేస్తే లబ్ధిదారుడు నష్టపోతాడు కనుక కొత్త ప్రభుత్వ నిబంధనలు వెలువడే వరకు లబ్ధిదారులపై ఒత్తిడి తేవద్దని కోరారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని తదితరుల పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ముదినేపల్లి రూరల్: మండలంలోని పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ అన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ మండల సభ్యులు స్థానిక ఎన్డీయే కార్యాలయంలో మంగళవారం వినోద్‌ను కలిశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం సమస్యలపై నియోజకవర్గ నేతలతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

గుడివాడ టౌన్: గత ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఐదేళ్ల సేవలందించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కోశాధికారి బి. సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మద్యం దుకాణాలు మూసివేసి ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తారంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో తాము ఆందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం దుకాణాల్లో సూపర్ వైజర్లు, సేల్స్ మేనేజర్‌లుగా 12 వేల మంది పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మద్యం అమ్మకాలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వేలాదిమంది నిరుద్యోగ యువత రోడ్డునపడతారని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తమపై సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



పమిడిముక్కల: గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శాంతి వెంకటేశ్వరరావు తన పదవికి రాజీనామా చేసినట్లు మంగళవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేశానని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ కార్యదర్శికి మెయిల్ ద్వారా తన రాజీనామా పత్రాన్ని పంపించినట్లు తెలిపారు. తనకు అన్ని విధాలా సహకరించిన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొండలమ్మ ఆలయ ధర్మకర్తలు రాజీనామా

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మంగళవారం ఆలయ ఈఓ కానూరి సురేష్ తెలిపారు. ఆలయ చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తలు పామర్తి వెంకటస్వామి, కొమ్మనబోయిన రవిశంకర్, వల్లూరు వెంకట్రావు, బాడిగ లీలా సౌజన్య, యార్లగడ్డ లక్ష్మి, నారేపాలెం వెంకట నిర్మల, దోకాల భాగ్యలక్ష్మి, యార్లగడ్డ పావని రాజీనామా చేసినట్లు ఈఓ పేర్కొన్నారు.

రేపు ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం

తోట్లవల్లూరు: ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 13వ తేదీన ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి-2 సురేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా నాలుగు జెడ్పీ పాఠశాలలు, 32 ఎంపీయూపీ, మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో 2,379 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వీరందరికీ పాఠ్య పుస్తకాలతోపాటు విద్యాకానుక కింద ఇప్పటికే నోటు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. బ్యాగులు, బూట్లు రావాల్సి ఉందని తెలిపారు.

వర్షాల్లో తస్మాత్ జాగ్రత్త

- ఇంటి పరిసరాల పరిశుభ్రతపై దృష్టి
- దోమల నివారణ ముఖ్యం



డాక్టర్ సుగుణావతి

గుడ్లవల్లేరు: వర్షా కాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటే భయాందోళనకు గురవకుండా ప్రజానీకం ధైర్యంగా ఉండొచ్చు. అంటువ్యాధులు వ్యాపించే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? అనే విషయాలు ప్రజల్లో అవగాహన అవసరం. ఆ అవగాహన కలిగి ఉంటే రోగాలబారిన పడకుండా ప్రజలు సురక్షితంగా ఉంటారని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సీహెచ్.సుగుణావతి తెలిపారు.

జాగ్రత్తలు ఇవి..

భయంకరమైన వ్యాధులను కలిగించేవి దోమలే. ఇళ్లలోని నీటి నిల్వల్లో మాత్రమే అవి పెరుగుతాయి. నివాసాలు, ఇళ్ల పరిసరాల్లోనూ నీరు నిల్వ లేకుండా చూసుకోవటం దోమల నివారణలో ముఖ్యాంశంగా పరిగణించాలి. కొన్ని రకాల దోమలు పగలూ, రాత్రి కూడా కుడతాయి. అలాంటి దోమలు కుడితే ప్రమాదం పొంచి ఉన్నట్లే. దోమ తెరలు వాడటం లేక ఇంటి కిటికీలు, తలుపులకు జాలీలు బిగించుకోవాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించడం మంచిది. నీటి తొట్టెలను ప్రతి వారం రోజులకు ఒకసారి ఖాళీ చేసి, మళ్లీ నింపుకోవాలి. తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, పనికి రాని వస్తువులు ఉంచకుండా ముఖ్యమైన జాగ్రత్తలుగా తీసుకోవాలి. ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండీషనర్లు, ఫ్లవర్ వాజ్‌లలో నీటిని తరచూ మార్చుకోవాలి. వాటర్ ట్యాంకులకు మూతలు వేసే ఉంచాలి. వ్యక్తిగత పరిశుభ్రత-పరిసరాల పరిశుభ్రత పాటించాలి. సందేహం వస్తే ఇళ్లలోని గోడలపై దోమల మందును చల్లుకోవాలి. కట్టడాలకు సంబంధించిన నీటి నిల్వలను లేకుండా చూసుకోవాలి. తాగునీటి నిల్వల్లో సైతం గుడ్లు పెట్టి లార్వా, ప్యూపాగా పెరిగే దోమలు కూడా అధిక సంఖ్యలో వ్యాపిస్తాయి. అలాంటి నిల్వలు కూడా లేకుండా జాగ్రత్త పడాలి. కాబట్టి విధిగా పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తే వర్షాల్లో వ్యాధులు దరికి చేరకుండా ప్రజలు సురక్షితంగా ఉంటారు.



ఇళ్ల పరిసరాల్లో ఇలా నీటి నిల్వలు ఉండరాదు



ఇలాంటి పాత టైర్లను ఇళ్ల వద్ద నుంచి తొలగించాలి

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

కైకలూరు: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) భరోసా ఇచ్చారు. ఏలూరు రోడ్ పార్టీ కార్యాలయం వద్ద నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. డీఎన్నార్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మంచి చేశామన్నారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీకి ఆదరణ ఎప్పటికీ తగ్గదన్నారు. ఎన్నికల్లో జయాపజయాలు సహజమన్నారు. ఎన్నికల పోలింగ్ తర్వాత నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో దౌర్జనాలు, విగ్రహాల ధ్వంసాలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కోసం కష్ట పడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, నాయకులు బీవీ.రావు, బలే నాగరాజు, ముంగర గోపాలకృష్ణ, గుడివాడ తంబి స్వామి, చెన్నంశెట్టి సోమేశ్వరరావు, చిట్టూరి మురళీ, పాము రవికుమార్, వడుపు రామారావు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో నాయకులతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

ఇరిగేషన్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

పామర్రు: ఇరిగేషన్ స్థలాలపై ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని పామర్రు ఇరిగేషన్ శాఖ అధికారి ఎం.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పామర్రు-గుడివాడ జాతీయరహదారి పక్కన ఉన్న పంట కాలువల గట్ల స్థలాలపై ఆక్రమణలను మంగళవారం సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇరిగేషన్ స్థలాల ఆక్రమణ చట్టరీత్యా నేరముగా పరిగణించబడుతుందన్నారు. దీంతో పాటు పంటకాలువలలో నీటి పారుదలకు తీవ్ర ఆటంకం కలుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న పుల్లేరు వద్ద ఉన్నగొడ్ల రేవు గతంలో ఆక్రమణకు గురైతే వాటిని తొలగించామన్నారు. పంచాయతీ వారికి అప్పగించి అక్కడ గొడ్లరేవు ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.



ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టిన ఇరిగేషన్ అధికారి అనిల్‌కుమార్

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

పామర్రు: జిల్లాలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన స్థానిక ఉండ్రపూడి-పోలవరంఅడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠమాసం మంగళవారం కావడంతో ఆలయం భక్తులతో నిండిపోయింది. తొలుత స్వామిని పంచామృతాలతో ఆవుపాలతో నవరసాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో భక్తులు పాల పొంగళ్లను వండి, స్వామికి నివేదనలు చేశారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు యజమానులు పూజలు చేయించుకున్నారు. స్వామికి వడమాలలు, నిమ్మకాయ మాలలు, నాగవల్లీలతో విశేషంగా పూజలను అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.



వీరాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా జ్యోతిప్రసాద్



ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జ్యోతిప్రసాద్‌ను సత్కరిస్తున్న నేతలు



కెనరా బ్యాంక్ మేనేజర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న సంఘ నాయకుడు అభయాంజనేయస్వామి

మండవల్లి: స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా కే.జ్యోతిప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమలాపురం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన బీ దుర్గారావు పోడూరు బదిలీపై వెళ్లారు. బదిలీపై వచ్చిన జ్యోతి ప్రసాద్‌ను పలువురు నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్.భాస్కరరావు, టీ అప్పారావు, ఎం.సత్తిబాబు, జీ తమ్మిస్వామి ఉన్నారు.

కెనరాబ్యాంక్ మేనేజర్‌గా ప్రియదర్శిని

గుడ్లవల్లేరు: అంగలూరు కెనరాబ్యాంకు మేనేజర్‌గా వి.సౌమ్య ప్రియదర్శిని మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆమెకు బ్యాంకు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. బ్యాంకు స్థాపించిన 40ఏళ్లలో ఒక మహిళ బ్యాంకు మేనేజర్‌గా రావటం ఇదే తొలిసారి అని ఆ బ్యాంకు ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు అభయాంజనేయస్వామి తెలిపారు. సంఘ నాయకులు సత్యనారాయణ, కిరణ్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించాలి

అవనిగడ్డ: రాష్ట్ర మంత్రి వర్గంలో మత్స్యకార ప్రజా ప్రతినిధులకు సముచిత స్థానం కల్పించాలని ఏపీ మత్స్యకార జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక 4వ వార్డులోని మత్స్యకార సామాజిక భవనంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం నుంచి అత్యధిక మెజారిటీతో ముగ్గురు మత్స్యకార ప్రజాప్రతినిధులు ఈ ఎన్నికల్లో విజయం సాధించారని, వీరిలో ఇద్దరిని మంత్రి వర్గంలోకి తీసుకోవాలని కూటమి పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని సామాజిక వర్గాలకు పరిపాలనలో, బడ్జెట్ కేటాయింపులు అన్ని రంగాల్లో దామాషా ప్రాతిపదికన కేటాయింపులు జరగాలన్నారు. మచిలీపట్నం, కాకినాడ నుంచి టీడీపీ, నరసాపురం నుంచి జనసేన అభ్యర్థులు గెలుపొందిన నేపథ్యంలో ఇద్దరికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. సమావేశంలో అగ్నికుల క్షత్రియ రాష్ట్ర నాయకుడు ఒడుగు శ్రీకాంత్, మత్స్యకార జేఏసీ నాయకులు కోలా బాలాజీ, నాగిడి గోవింద్, సైకం శ్రీనివాసరావు, నాగిడి అమలేశ్వరరావు, చాపల రామకృష్ణ, నడకుదురు దావీదు, శంకరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణబాబు, కోలా వెంకటేశ్వరరావు, అండ్రాజు శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, కొప్పనాతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట కాలువలో ఉపాధిహామీ పనులు



మండవల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో గన్నవరంలో పంట కాలువ పనులను రూ.63 వేల ఉపాధి నిధులతో 45 మంది కూలీలు మంగళవారం చేపట్టారు. ఎంటీపీ ఎస్.నవీన్ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా కూలీలకు జీవనోపాధి కలుగుతుందన్నారు. పంట కాలువలు, పంట బోదెలు మరమ్మతులు చేయడం ద్వారా పంట పొలాలలకు సమృద్ధిగా సాగునీరు చేరుతుందని తెలిపారు. దీంతో రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

గుడివాడ టౌన్: గత ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఐదేళ్ల సేవలందించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కోశాధికారి బి. సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మద్యం దుకాణాలు మూసివేసి ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తారంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో తాము ఆందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం దుకాణాల్లో సూపర్ వైజర్లు, సేల్స్ మేనేజర్‌లుగా 12 వేల మంది పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మద్యం అమ్మకాలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వేలాదిమంది నిరుద్యోగ యువత రోడ్డునపడతారని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తమపై సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి గాంచిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం అభిషేకాలు చేశారు. ఈ అభిషేకాలకు జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారి పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేశారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి 160కి పైగా అభిషేకాలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

14న ఆలయ భూములకు వేలం

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి జగన్నాథస్వామి ఆలయ భూములకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి గుడివాడ రూరల్ మండలం శేరిగొల్వేపల్లిలో 2.25 ఎకరాల విస్తీర్ణంలో చేపల చెరువు ఉందని పేర్కొన్నారు. ఈ చెరువును మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు శేరిగొల్వేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద 14న వేలం నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా ఆలయానికి వడాలిలో వివిధ సర్వే నంబర్లలో ఉన్న పల్లపు భూములకు సంబంధించి ఆలయం వద్ద ఈ నెల 14 మధ్యాహ్నం వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వడాలిలోని విశ్వేశ్వరస్వామి ఆలయానికి గ్రామంలో ఉన్న పల్లపు భూమికి 14న జగన్నాథస్వామి ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా మండలంలోని అల్లూరు సోమేశ్వరస్వామి ఆలయానికి అల్లూరు, బొమ్మినంపాడులో ఉన్న చేపల చెరువులను మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు 14న ఆలయం వద్ద వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇదే ఆలయానికి సంబంధించి అల్లూరు, చిగురుకోట గ్రామాల్లో ఉన్న మెరక భూములు సైతం వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

పండ్ల ధరలకు రెక్కలు

సామాన్యులకు అందని ఫలాలు



పండ్ల దుకాణం

పామర్రు: మండలంలోని పలు చోట్ల పండ్ల ధరలు ప్రజలకు సెగ పుట్టిస్తున్నాయి. వేసవి కావడంతో దిగుబడులు తగ్గి పండ్ల ధరలు పెరిగడం పరిపాటని వ్యాపారులు చెబుతున్నారు. పోషక విలువలు ఎక్కువగా ఉన్న పండ్ల వినియోగం ఇటీవల బాగా పెరిగింది. తాజా పండ్లు తీసుకోవటం వల్ల ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని వైద్యులు సూచిస్తుండటంతో పండ్లు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరిగింది. వ్యక్తిగత ఆరోగ్యం కోసం, పూజా కార్యక్రమాలకు, బంధువుల ఇంటికి, పరామర్శలకు వెళ్లినప్పుడు యాపిల్, దానిమ్మ, బత్తాయి, కమలా, పైనాపిల్ తదితర పండ్లు కొనాలంటే వాటి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. నియోజకవర్గంలోని పామర్రులో, మొవ్వ మండలం కూచిపూడి, పమిడిముక్కల మండలం మంటాడ మెయిన్‌రోడ్డు, తోట్లవల్లూరు సెంటర్‌లో దుకాణాలు, కొందరు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో తోపుడు బండ్లపై పండ్లు విక్రయిస్తున్నారు. చాలా మంది వ్యాపారులు సైకిళ్లపై గ్రామాల్లో తిరుగుతూ సీజన్ వారిగా లభించే వివిధ రకాల పండ్లు అమ్ముతున్నారు.

మార్కెట్‌లో పండ్ల ధరలు ఇలా..

మార్కెట్‌లో దేశ విదేశీ రకాలపండ్లు అందుబాటులో ఉన్నా వాటి ధరలు మాత్రం ఆకాశంలో ఉంటున్నాయి. గత ఏడాదితో పోలిస్తే 10 నుంచి 20 శాతం ధరలు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో డజన్ యాపిల్స్ రూ. 300, మామిడి పళ్లు డజను రూ.300 నుంచి రూ.400 వరకు ఉన్నాయి. దానిమ్మ రూ. 250, బత్తాయి రూ.150, కమలా రూ.200, చక్రకేళి అరటి పండ్లు డజను రూ.80, కేజీ నల్ల ద్రాక్ష రూ.100, తెల్ల ద్రాక్ష రూ.80కు విక్రయిస్తున్నారు. వీటితో పాటుగా నిమ్మకాయల ధర పెరగడంతో కాయ రూ.2కు అమ్ముతున్నారు. దీంతో పండ్ల ధరలు అందుబాటులో లేక వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్ల ద్వారా పండ్ల వినియోగం అధికంగా పెరగటంతో వాటి ధరలకు రెక్కలు వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

పండ్ల వినియోగం పెరిగింది

గతంలో కంటే పండ్లు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. వేసవి కావటంతో ధరలు పెరిగాయి. విజయవాడ హోల్‌సేల్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన ధరలకు అనుగుణంగానే గ్రామాల్లో విక్రయిస్తున్నాం.

– వీరబాబు, పండ్ల వ్యాపారి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విలేకరులతో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ అప్సబేగం

గుడివాడ టౌన్: ప్రస్తుత సమాజంలో రకరకాల పద్ధతిలో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంటుమిల్లి రోడ్ బ్రాంచ్ మేనేజర్ అప్సబేగం అన్నారు. బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తాము నడుం బిగించామన్నారు. తమ ఖాతాదారులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. పత్రికలు, మీడియా ద్వారా వారికి అవగాహన పెంచామన్నారు. ప్రస్తుతం కొత్త విధానంలో కేటుగాళ్లు కొంత సొమ్మును ఖాతాదారుల అకౌంట్‌కు పంపి మా డబ్బు పొరపాటున మీ ఖాతాలోకి చేరాయి తిరిగి పంపమని కోరతారన్నారు. లేకుంటే మీకు వచ్చిన ఓటీపీ చెప్పినా సరిపోతుందని అంటారన్నారు. ఈ రెండింటిలో ఏది చేసినా ఖాతాను వెంటనే హ్యాక్ చేసి ఖాతాలోని డబ్బు కొల్లగొడతారన్నారు. రకరకాల ఫోన్‌ల నుంచి స్టేట్ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం అంటూ వచ్చే ఫోన్‌లకు సమాధానం చెప్పవద్దన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ బ్యాంకు ఖాతాదారులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకునే అవకాశం ఉండదన్నారు. కావున ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించి అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారి ఫణి పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన అయ్యవారి రుద్రవరం-మండవల్లి రహదారి



రోడ్డును బాగు చేయరూ..

మండవల్లి: మండవల్లి-అయ్యవారి రుద్రవరం రహదారి అధ్వానంగా మారింది. సుమారు 2 కిలోమీటర్లు ఎక్కడ చూసినా గుంతలతో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామం నుంచి రోజూ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల నిమిత్తం పలువురు మండవల్లి వచ్చి వెళుతుంటారు. వర్షం కురిస్తే రాకపోకలు సాగించేందుకు పలు అవస్థలు పడుతున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో చీకట్లో రహదారిపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా రహదారిని అభివృద్ధి చేసి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పాఠశాలల ముస్తాబు



ముదినేపల్లి రూరల్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెరుచుకునేందుకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పాఠశాలలను శుభ్రం చేసి, మరుగుదొడ్లు, వాటర్‌ట్యాంక్‌లు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్ మరమ్మతులపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులు ప్రధానోపాధ్యాయులను ఇప్పటికే ఆదేశించారు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న పాఠశాలలు తిరిగి ప్రారంభించాల్సి ఉండగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం వల్ల 13కు వాయిదా పడింది. దీంతో పాఠశాలలను విద్యార్థులకు అనువుగా ఉండేవిధంగా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 13న పాఠశాలలు ప్రారంభించే విధంగా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నారు.

రామకృష్ణ సేవా సమితిలో ఉచిత ట్యుటోరియల్

కైకలూరు: ఎన్జీఓస్ కాలనీ రామకృష్ణ సేవా సమితిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత ట్యుటోరియల్ నిర్వహిస్తామని అధ్యక్షుడు భూపతిరాజు వెంకటేశ్వరవర్మ మంగళవారం తెలిపారు. ఈ నెల 26 నుంచి రోజూ సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు సాయంత్రం 5 గంటల తర్వాత సేవా సమితి వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 91338 75174, 99129 55777 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.